సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 16.658 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 2,752 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.61,240
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,518
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,683
సవర (8 గ్రా) -	రూ.45,464

గరిష్ఠం/కనిష్ఠం
34.3 /26.4

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 61 శాతం ఉంది. సోమవారం వాతావరణం చల్లబడి ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

94.96 శాతం మందికి పింఛన్ కానుక అందజేత



నెల్లూరు కామాక్షినగర్‌కు చెందిన లబ్ధిదారుడు కుమార్‌కు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ రియాజ్

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా కొనసాగుతుంది. మూడో రోజు ఆదివారం 94.96 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ నగదు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,09,825 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సిఉండగా 2,94,196 మందికి అందజేశారు. ఈ నెల 5వ తేదీ వరకు వైఎస్సార్ పింఛన్ కానుక నగదు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

కండలేరులో 14.014 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 14.014 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 845 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 40, లోలెవల్ స్లూయిజ్‌కు 80 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

7న పెంచలకోనలో కృష్ణాష్టమి

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 7వ తేదీన కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. స్వామివారికి ఉదయం 9 గంటలకు నవ కలశ స్నపన తిరుమంజనం, సాయంత్రం ఉట్టి మహోత్సవం, రాత్రి శేషవాహనంపై స్వామిఅమ్మవార్ల క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

లక్ష గడపల విజయోత్సవ సభ వాయిదా

కోవూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన నియోజకవర్గంలో లక్ష గడపలు పూర్తి చేస్తున్న నేపథ్యంలో నిర్వహించాలనుకున్న విజయోత్సవ సభ ఈ నెల 7వ తేదీకి వాయిదా పడిందని డీసీఏబీ చైర్మన్ దొడ్లంరెడ్డి నిరంజన్‌బాబు రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఇందుకూరుపేట మండలం మైపాడులో జరుగుతుందని తెలిపారు.

నగల బ్యాగ్ అపహరణ

- రూ.5.15 లక్షల విలువ చేసే బంగారు, నగదు, సెల్‌ఫోన్ చోరీ

నెల్లూరు(క్రైమ్): అందరూ వివాహ వేడుకల్లో తలమునకలై ఉండగా ఓ మహిళ నగల బ్యాగ్‌ను గుర్తుతెలియని దుండగులు అపహరించుకుని వెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. చెన్నైకు చెందిన చెందిన కె.గౌరీశంకరప్రసాద్ తన కుటుంబంతో కలిసి నెల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బంధువుల వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల ఒకటో తేదీ రాత్రి వచ్చారు. గౌరీశంకర్‌ప్రసాద్ భార్య తన నగల బ్యాగ్‌ను పక్కనున్న కుర్చీలో పెట్టి వివాహ వేడుకను తిలకించసాగింది. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు బ్యాగ్‌ను అపహరించుకుని వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత బ్యాగ్ లేకపోవడాన్ని గమనించిన బాధితులు బ్యాగ్ కోసం ఫంక్షన్ హాల్‌లో గాలించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో బాధితులు దర్గామిట్ట పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. బ్యాగ్‌లో రూ.5.15 లక్షల విలువ చేసే పదమూడున్నర సవర్ల బంగారు ఆభరణాలు, రూ.25 వేల నగదు, సెల్‌ఫోను ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్గామిట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామిక ప్రగతి పరుగులు



ఏ పరిశ్రమ ఏర్పాటు కావాలన్నా అనుకూల వాతావరణంతోపాటు రవాణా సౌకర్యాలు, ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో ముఖ్యం. ఇవన్నీ పుష్కలంగా ఉన్నచోట పరిశ్రమల ఏర్పాటుకు ఢోకా ఉండదు. అలాగే స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా మెండుగా దొరుకుతాయి. పై అంశాలన్నీ సమృద్ధిగా ఉన్న జిల్లాలోని మనుబోలు మండలంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోంది.

- హైవే, కృష్ణపట్నం పోర్టులతో అనుకూలత
- రోడ్డు, రైలు, జలమార్గాల ద్వారా రవాణా
- వందలాది మందికి ఉపాధి అవకాశాలు

మనుబోలు: గత కొన్నేళ్లుగా మనుబోలు మండలంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోంది. దీంతో స్థానికంగా ఉండే వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. మండల పరిధిలో 10 కిలోమీటర్లకు పైగా విస్తరించిన జాతీయ రహదారి, 15 కిలోమీటర్ల దూరంలో కృష్ణపట్నం పోర్టు, స్థానికంగా రైల్వేస్టేషన్, 140 కిలోమీటర్ల దూరంలో చెన్నై మహానగరం ఉన్నాయి. దీంతో రోడ్డు, రైలు, జలమార్గాల ద్వారా రవాణా సౌకర్యాలకు అనువుగా ఉండడంతో పలు పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో బయట నుంచి వచ్చి చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పే వారిని మనుబోలు మండలం విశేషంగా ఆకర్షిస్తోంది.

70 శాతానికి పైగా స్థానికులే..

మనుబోలు మండల పరిధిలో పల్లవ గ్రానైట్ ఫ్యాక్టరీ, 765 కేవీ, 400 కేవీ పవర్ గ్రిడ్స్, ట్రాన్స్‌కో 400 కేవీ సబ్ స్టేషన్, జీడిపప్పు ఫ్యాక్టరీ, ఎస్‌వీఎస్ మినరల్స్, అట్టపెట్టెలు తయారు చేసే ఫ్యాక్టరీ, మెక్‌డొనాల్డ్స్ ఫ్రాంచైజీ ఉన్నాయి. అలాగే హైవేకు ఇరువైపులా 5 పెట్రోల్ బంకులు, 4 దాబా హోటళ్లు ఉన్నాయి. వీటన్నింటిలో వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. పవర్ గ్రిడ్ మినహా మిగిలిన పరిశ్రమల్లో 70 శాతానికి పైగా స్థానికులే పనిచేస్తున్నారు.



జీడిపప్పు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు (ఫైల్)



జీడిపప్పు ఫ్యాక్టరీ



పవర్ గ్రిడ్

వీటితోపాటు త్వరలో శ్రీచక్ర ఎకోటెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పెద్ద పాలిస్టర్ పరిశ్రమ, ఎ టూ బి రెస్టారెంట్స్, ఎలక్ట్రిక్ కార్ చార్జింగ్ సెంటర్, స్టార్‌బక్స్‌లతోపాటు మరికొన్ని ఫ్రాంచైజీలు మండలంలో ఏర్పాటు కానున్నాయి. తద్వారా వందలాది మందికి ఉపాధి దొరికే అవకాశం ఉంది.

అనుకూల వాతావరణంతోనే..

మనుబోలు మండలంలో అన్ని రకాలుగా అనుకూల వాతావరణం ఉండడంతోనే పరిశ్రమలు ఎక్కువగా ఏర్పాటవుతున్నాయని తెలుస్తోంది. రవాణా సౌకర్యాలతోపాటు పరిశ్రమలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, స్థానిక మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహాయ సహకారాలు ఉండడంతో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఎంతోమంది ముందుకొస్తున్నారని తెలుస్తోంది.

అన్నివిధాలా అనుకూలం



మూడేళ్ల క్రితం మనుబోలు మండలంలోని అక్కంపేట సమీపంలో రోడ్డు పక్కన అకాజు ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించాం. ముడి జీడి గింజలను దక్షిణాఫ్రికా నుంచి దిగుమతి చేసుకుంటాం. హైవేకు దగ్గరగా ఉండడంతోపాటు కృష్ణపట్నం పోర్టు, చెన్నై పోర్ట్‌లకు కూడా రవాణా సౌకర్యం సులభతరంగా ఉండడంతో ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నాం. మా పరిశ్రమలో ప్రస్తుతం 60 మంది పనిచేస్తున్నారు. అందరూ స్థానికులే. భవిష్యత్‌లో యూనిట్‌ను మరింత విస్తరించాలనుకుంటున్నాం.

– ఆర్.శివాజీ, మేనేజింగ్ పార్టనర్, అకాజు ప్రాసెసింగ్ (ప్ర) లిమిటెడ్

మా కళ్ల ముందే ఎంతో మారిపోయింది



మనుబోలు మండలం ఇటీవల కాలంలో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. దీంతో వ్యవసాయ భూముల ధరలు కూడా బాగా పెరిగాయి. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి ముడి సరుకులు దిగుమతి చేసుకోవాలన్నా, ఇక్కడ తయారైన ఉత్పత్తులను వాటిని ఎగుమతి చేయాలన్నా రవాణా సౌకర్యం ఎంతో ముఖ్యం. మనుబోలుకు హైవే, కృష్ణపట్నం, చైన్నై పోర్టులు, రైల్వేస్టేషన్ అనుకూలంగా ఉండడంతో పరిశ్రమలు అధికంగా ఏర్పాటవుతున్నాయి.

– వెందోటి భాస్కర్‌రెడ్డి, రైతు, జట్ల కొండూరు

బంగారు ముక్కుపుడక బహూకరణ



ముక్కుపుడకను చూపుతున్న ఆలయ చైర్మన్, ఈఓ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి దాతలు ఆదివారం బంగారు ముక్కుపుడకను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన కె.మల్లికార్జున్‌నాయుడు–రాధికమ్మ దంపతులు అమ్మవారికి 8 గ్రాముల బంగారు ముక్కుపుడకను అందజేసినట్లు తెలిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 385 మెగావాట్లు, 2వ యూనిట్లో 375 మెగావాట్లు, 3వ యూనిట్లో 410 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు తెలిపారు.

సీఎం స్థానం.. ప్రజల గుండెల్లో పదిలం



మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కావలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానం ప్రజల గుండెల్లో పదిలమని, జగన్ అంటే నమ్మకం అని రాష్ట్ర ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం 175వ రోజుకు చేరుకోవడంతో కావలిలోని 34వ వార్డులో ఆదివారం సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ రామాయపట్నంపోర్టు,ఫిషింగ్‌హార్బర్ కావలికి కానుక అని, ఈ ప్రాజెక్టులు ఎన్నికల లోపు ప్రారంభమవుతా యని తెలిపారు. కృష్ణపట్నంపోర్టు సమీపంలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కృషితో రామాయపట్నం పోర్టు మంజూరైందని తెలిపారు. కృష్ణపట్నం, వైజాగ్ పోర్టుల వల్ల వేలాది మంది ఉపాధి పొందుతున్నారని, అలాగే రామాయపట్నంపోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వల్ల కావలి నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని తెలిపారు. కావలి అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కావలిలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి పనిచేయాలని నేతలకు సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నాయకులు కె.శివకుమార్ రెడ్డి, కె.వెంకటనారాయణ, గుర్రం వెంకటేశ్వర్లు, పుల్లా శ్రీనివాసులురెడ్డి దంపతులు, నాగేశ్వరమ్మ, కుందుర్తి శ్రీనివాసులు, పి. కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కాకుటూరులో కామన్ ఫెసిలిటీ సెంటర్, వీఎల్ షాపింగ్‌మాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎంఎస్‌ఎంఈ పథకం కింద రూ.8.27 కోట్లతో నిర్మించనున్న కామన్ ఫెసిలిటీ సెంటర్, వీఎల్ షాపింగ్‌మాల్‌కు మంత్రి కాకాణి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనతోపాటు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేలా కృషి చేస్తోందని తెలిపారు. చదువుతోపాటు సంబంధిత రంగాల్లో నైపుణ్యం ఉన్నప్పుడే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కాకుటూరు గ్రామంలో రూ.8.27 కోట్లతో గార్మెంట్స్ తయారీ యూనిట్‌తోపాటు ఆ రంగంలో యువతకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు అమలు జరిగేలా కామన్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణం, అలాగే తయారైన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా షాపింగ్‌మాల్ ఏర్పాటు చేసే ఆలోచన చేయడం అభినందనీయమన్నారు. కామన్ ఫెసిలిటీ సెంటర్, షాపింగ్‌మాల్ నిర్మాణం వల్ల ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందడంతోపాటు యువతకు ఉద్యోగ అవకాశాలు లభించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయన్నారు. ఈ ప్రాంతం కృష్ణపట్నం పోర్టుకు సమీపంలో ఉండడం వల్ల ఇక్కడ ఉత్పత్తి అయ్యే వస్త్రాలను ఎగుమతి చేసేందుకు సదుపాయాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. కరోనా సమయంలోనూ ఇన్సెంటివ్‌లు ఇచ్చి చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించిన ఘనత దేశ చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందని కొనియాడారు. ఈ సందర్భంగా కామన్ ఫెసిలిటీ సెంటర్‌కు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి కాకాణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ జీఎం సుధాకర్, వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు వసంతలక్ష్మి, రవికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా రొయ్యల సాగు

రొయ్యల చెరువులు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేయడం ద్వారా తీరప్రాంతంలోని గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. పచ్చటి పంట పొలాలతోపాటు ప్రభుత్వ భూములు, కాలువలను సైతం ఆక్రమించి గుంతలు తవ్వి రొయ్యల సాగు చేపడుతుండడంతో వరదల సమయంలో ఊహించని ముప్పు ఎదురయ్యే పరిస్థితి ఉంది. తీవ్ర ఆందోళన కలిగించే ఈ అంశంపై రైతుల్లో చైతన్యం వస్తేనే ముప్పు నుంచి తప్పించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

- విచ్చలవిడిగా రొయ్యల చెరువుల తవ్వకాలు
- అనుమతులు లేకుండానే ఏర్పాటు
- ముంపు వస్తే గ్రామాలకు పొంచి ఉన్న ముప్పు



కావలి నియోజకవర్గంలో సాగులో ఉన్న రొయ్యల గుంతలు

కావలి/బిట్రగుంట: కావలి నియోజకవర్గంలో విచ్చలవిడిగా తవ్వుతున్న రొయ్యల చెరువుల కారణంగా తూర్పు ప్రాంత గ్రామాలకు తీవ్ర ముప్పు పొంచి ఉంది. పంట కాలువలు, ఎల్లవ కాలువలు ఆక్రమించి చెరువులు ఏర్పాటు చేయడం, వరద నీరు సముద్రంలో కలిపే కాలువలను సైతం ఆక్రమించి రొయ్యల చెరువులుగా మార్చేస్తుండడంతో వరదల సమయంలో ఊహించని ముప్పు ఎదురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రతి ఏటా సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు తీరానికి తుపాన్ల ముప్పు పొంచి ఉంటుంది. తుపాన్లు మాత్రమే కాకుండా అల్పపీడనాలు, వాయుగుండాలతో కురిసే భారీ వర్షాలు తీర ప్రాంత గ్రామాలకు ఫిబ్రవరి వరకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంటాయి. తుపాన్లు, అల్పపీడనాల సమయంలో వచ్చే భారీ వర్షాలు, వరదల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వరదనీటిని సముద్రంలోకి తీసుకువచ్చే పిల్లివాగు, ఉబ్బలవాగు, ఎస్కేప్ ఛానల్ పొంగి గ్రామాల చుట్టూ వరద నీరు ముంచెత్తుతుంది. వరద ఉధృతి తగ్గే వరకూ బోగోలు మండలంలోని ముంగమూరు, అల్లిమడుగు, తెల్లగుంట, ఉమామహేశ్వరపురం తదితర గ్రామాలకు రాకపోకలు కూడా స్తంభించిపోతాయి. ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు, వంతెనలు కూడా ధ్వంసమవుతుండడంతో అధికారులు పడవల సాయంతో గ్రామాలకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంటుంది. రొయ్యల చెరువులు ఎక్కువగా లేని సమయంలోనే ముంపు పరిస్థితిని ఎదుర్కొనేందుకు అధికారులు నానా అవస్థలు పడేవారు. ప్రస్తుతం విపరీతంగా ఏర్పాటు చేస్తున్న రొయ్యల చెరువుల కారణంగా పరిస్థితి చేయిదాటిపోయేలా ఉంది.

విచ్చలవిడిగా రొయ్యలసాగు

కావలి నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాల్లో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా రొయ్యల సాగు చేపడుతున్నారు. అధికారుల అంచనాల ప్రకారం సుమారు 1500 ఎకరాల్లో అనధికార రొయ్యల చెరువులు ఉన్నట్లు నివేదికల్లో ఉన్నా వాస్తవానికి 6 వేల ఎకరాలకు పైగా రొయ్యల చెరువులు ఉన్నాయి. గడిచిన రెండేళ్లలోనే సుమారు 800 నుంచి 1000 ఎకరాలకు పైగా కొత్తగా చెరువులు ఏర్పాటు చేశారు. ముంగమూరు, ఏనుగులబావి, కోళ్లదిన్నె, అల్లిమడుగు, తెల్లగుంట, ఎస్వీపాళెం, జువ్వలదిన్నెతోపాటు తీరంలోని 8 మత్స్యకార గ్రామాల్లో రొయ్యల సాగు గణనీయంగా పెరిగింది. ఆయా గ్రామాల్లో పచ్చటి పంట పొలాలను, పంట కాలువలను రొయ్యల చెరువులుగా మారుస్తుండడంతో భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వచ్చే పరిస్థితి ఉంది. భారీ వర్షాలు, వరదల సమయంలో పిల్లివాగు, ఉబ్బలవాగు, ఎస్కేప్ ఛానల్‌తోపాటు పంట కాలువలు, ఎల్లవ కాలువన్నీ వరద నీటిని చిప్పలేరు ద్వారా సముద్రంలోకి పంపుతాయి. ప్రస్తుతం కాలువలన్నీ ఆక్రమణలకు గురవడం, వరదనీరు సాఫీగా వెళ్లే వీలు లేకుండా ఎత్తుగా రొయ్యల చెరువుల కట్టలు ఏర్పాటు చేస్తుండడంతో తూర్పు గ్రామాలకు తీవ్ర వరద ముప్పు పొంచి ఉంది.

అనుమతులు అంతంతమాత్రమే

రొయ్యల చెరువుల సాగుదారులెవరూ అనుమతులు తీసుకోవడం లేదని తెలుస్తోంది. పచ్చటి పంట పొలాలతోపాటు ప్రభుత్వ భూములు, కాలువలు కూడా ఆక్రమించి చెరువులు ఏర్పాటు చేస్తున్నారు. రొయ్యల చెరువుల రెగ్యులరైజేషన్ కోసం జనవరి నెలాఖరు వరకూ గడువు ఉచ్చినా ఇప్పటి వరకూ నియోజకవర్గంలో 100 మందికి మించి రైతులు దరఖాస్తు చేసుకోలేదు. ఎక్కువ శాతం ప్రభుత్వ భూముల్లోనే ఉండడం, రొయ్యల సాగు భూములకు సంబంధించిన సర్వే నంబర్లకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో కల్టివేషన్ ఆఫ్ సర్టిఫికెట్‌లు (సీఓసీ) లేక రైతులు రెగ్యులరైజ్ చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. రెగ్యులరైజ్ చేయని చెరువులను జనవరి నెలాఖరుపైన ముందుగా విద్యుత్ కనెక్షన్‌లు రద్దు చేసి పూర్తిగా తొలగిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నా ఆక్వా సిండికేట్ లెక్క చేయడం లేదు.

రైతుల్లో చైతన్యం వస్తేనే..

పొలాల్లో అగ్రికల్చర్ సాగు చేసే రైతులకే మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఆక్వా సాగు చేసే రైతులు, అగ్రికల్చర్ సాగు చేసే రైతులు ఒక అంగీకారానికి వస్తుండడంతో ఎడాపెడా రొయ్యలు చెరువులు పుట్టుకొస్తున్నాయి. దీనికితోడు నిర్దిష్టమైన అనుమతులు కూడా తీసుకోకుండానే రొయ్యల సాగు చేస్తుండడంతో, ఏ ప్రాంతంలో ఎవరు ఎంత విస్తీర్ణంలో సాగు చేసుకుంటున్నారో కూడా తెలియడం లేదు. రైతుల్లో చైతన్యం వస్తేనే ఇలాంటి ధోరణిని నివారించవచ్చు.

– ఎస్.శ్రీనివాసులు, సహాయ సంచాలకులు, మత్స్యశాఖ, కావలి

క్లుప్తంగా

అట్టహాసంగా పరుగు పందెం పోటీలు



పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో నాయకులు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం సమీపంలో ఆదివారం పరుగుపందెం పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీల్లో తిరుపతి జిల్లాతో పాటు నెల్లూరు, వైఎస్సార్ కడప, కృష్ణా, శ్రీకాకుళం తదితర జిల్లాలకు చెందిన సుమారు 500 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఎస్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు, జాతీయ పారా అథ్లెటిక్ క్రీడాకారుడు మోమిడి లక్ష్మయ్య, చైర్మన్ కలికి సుదీప్‌రెడ్డి, సభ్యుల సారథ్యంలో 6, 8, 10, 12,14,18 ఏళ్ల కలిగిన పిల్లలకు 60, 80, 100, 200, 300, 600 మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్లాపూడి రాజేష్, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వేమా సుధాకర్, నెల్లూరుపల్లి నాగరాజు, డాక్టర్ గోపీనాథ్ జెండా ఊపి ప్రారంభించారు. ఆరు విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లను వైఎస్సార్‌సీపీ అర్బన్ జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, నాయకులు ప్రకాష్ నాయుడు, సూళ్లూరుపేట రైల్వే అధికారి అలెగ్జాండర్, ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు, తదితరులు అందజేశారు.

రాష్ట్ర పండగగా పోలేరమ్మ జాతర

- మిన్నంటిన సంబరాలు



అంకమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న కౌన్సిలర్లు

వెంకటగిరిరూరల్: పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండగగా గుర్తించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని 19వ వార్డులో కౌన్సిలర్ వహీద, యస్దాని దంపతుల ఆధ్వర్యంలో అంకమ్మ ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్‌చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి, మహిళా కౌన్సిలర్లు అంబలితో గ్రామోత్సవంలా ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండగగా గుర్తించడపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మున్సిపల్ విప్ పూజారిలక్ష్మి, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు సుబ్బారావు, జానకిరామయ్య, ఎంఏ నారాయణ, చంద్రశేఖర్, కందాటి కల్యాణి, సుఖన్య, దేవికాచౌదరి, నాయకులు పీ శ్రీను, సీహెచ్ మురళి పాల్గొన్నారు.

ఇస్రో చైర్మన్‌కు అభినందనలు



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తదితరులు ఆదివారం శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ఒక నెల వ్యవధిలో చంద్రుడి మీద పరిశోధనలకు చంద్రయాన్-3, సూర్యుడి మీద అధ్యయనం చేయడానికి సూర్యయాన్-1 పేరుతో ఆదిత్య ఎల్1 ప్రయోగాలను విజయవంతం చేయడం గొప్పవిషయమన్నారు. భారతదేశం గర్వపడేలా ప్రయోగాలు చేసి విజయాలను సాధించి ప్రపంచ పటంలో భారత్‌కు ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిన ఘనత ఇస్రో శాస్త్రవేత్తలకు దక్కుతుందన్నారు. శాస్త్రవేత్తలను నడిపించి ప్రయోగాలను సక్సెస్ చేయడంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్ పాత్ర అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌యాదవ్, వైస్ చైర్మన్లు పోలూరు పద్మా మిల్టన్, చిన్ని సత్యనారాయణ, పార్టీ నాయకులు అల్లూరు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 149
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 254
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 282
లేయర్ చికెన్	: 178

నిమ్మధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ. 65
సన్నవి	: రూ. 40
పండ్లు	: రూ. 10

రైలు పట్టాలపై మృత్యు ఘోష

ప్రమాదవశాత్తు పట్టాలు దాటే క్రమంలో కొందరు..ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కలహాలతో మరికొందరు..రైల్లో నుంచి జారిపడి ఇంకొందరు ..ఇలా నిత్యం ఏదోక రూపంలో రైలు పట్టాలపై మృత్యు ఘోష వినిపిస్తోంది. రైలు ప్రమాదాల్లో గుర్తించిన మృతదేహాలు బంధువులకు చేరుతున్నా..గుర్తింపులేనివి కుటుంబ సభ్యుల కడచూపునకు నోచుకోకపోవడం విషాదకరం.

ఈ ఏడాది 229 మంది మృతి

- 107 మంది అనాథలుగానే తనువు చాలించిన వైనం
- నెలకు సగటున 28 మందికిపైగా మృత్యువాత



ప్రమాదమని తెలిసినా పట్టాలు దాటుతున్న ప్రయాణికులు(ఫైల్)

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రైల్వే సబ్ డివిజన్ పరిధిలోని ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో 444 కిలోమీటర్ల మేర రైలు మార్గం విస్తరించి ఉంది. నిత్యం సుమారు 120 రైళ్ల వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే ప్రయాణికులు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం..ప్రమాదాల నివారణ చర్యల్లో రైల్వే అధికారుల ఉదాసీనత వెరసి నిత్యం ఏదోక చోట నిండు ప్రాణాలు రైలు చక్రాల కింద నలుగుతున్నాయి. రైలు ప్రమాదాల్లో ఎలాగోలా గుర్తించిన మృతదేహాలు బంధువులకు చేరుతున్నా...గుర్తింపులేనివి అనాథ శవాలుగా మిగిలిపోతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు మాసాంతం వరకు నెల్లూరు రైల్వే సబ్‌డివిజన్ పరిధిలో రైలు పట్టాలపై జారిపడి, బలవన్మరణం, సహజ రూపాల్లో 229 మంది మృతి చెందారు. దీనిని బట్టి చూస్తే నెలకు సగటున 28 మందికిపైగా రైలు పట్టాలపై మృత్యువాత పడుతున్నారు. నెల్లూరు రైల్వే సబ్‌డివిజన్ పరిధిలోని చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు పరిధిలో చిన్న, పెద్ద రైల్వేస్టేషన్లు కలిపి 55 ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతిరోజూ ఏదోక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రైలు పట్టాలు దాటుతూ, రైల్లో నుంచి జారిపడి, రైలు కిందపడి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఈ ఏడాది ఆగస్టు మాసాంతం వరకు రైల్లో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి 107మంది మృతి చెందారు. ప్రేమ విఫలమై, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో 110 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 12 మంది అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెందారు. మొత్తంగా వివిధ



ప్రయాణికులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు(ఫైల్)

కారణాలతో 229 మంది మృతి చెందారు. అందులో 122 మంది వివరాలు లభ్యం కాగా వారి మృతదేహాలను రైల్వే పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగిలిన 107 మంది వివరాలు లభ్యం కాకపోవడంతో అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించారు.

గుర్తింపు కష్టతరం..


నెలకు సగటున 28 మంది రైలు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. వారి మృతదేహాలు ఛిద్రమై గుర్తుపట్టలేని విధంగా మారుతుంటాయి. అనేక సందర్భాల్లో మృతదేహాలు రైలుపట్టాల పక్కనున్న ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల మధ్యన పడితే కొన్నిరోజుల వరకు ఎవరూ గుర్తించలేరు. అలాంటి పరిస్థితుల్లో మృతదేహాల గుర్తింపు, తరలింపు మరింత దారుణంగా ఉంటుంది. అయిన వారు సైతం మృతదేహాలను గుర్తుపట్టడం కష్టతరమే. నిబంధనల ప్రకారం గుర్తుతెలియని మృతదేహాలను 72గంటల పాటు మార్చురీలో భద్రపరచాల్సి ఉంటుంది. అప్పటికీ మృతుడి సంబంధీకులు ఎవ్వరూ రాకపోతే రైల్వే పోలీసులే దగ్గరుండి ఖననం చేయిస్తారు. సంబంధీకుల కడసారి చూపునకు కూడా నోచుకోక ఎంతోమంది అనాథలుగా కాలగర్భంలో కలిసిపోతున్నారు. అధికశాతం ప్రమాదాలకు నిర్లక్ష్యమే కారణంగా నిలుస్తోంది. కదిలే రైలు నుంచి ఎక్కడం, దిగడం, ఫుట్‌బోర్డు ప్రయాణం, అటు, ఇటు గమనించకుండా అజాగ్రత్తగా రైలుపట్టాలు దాటడం, తదితరాలు కారణాలుగా నిలుస్తున్నాయి.

ప్రమాద తీరు	కేసులు	గుర్తించినవి	గుర్తుతెలియనివి
రైలు నుంచి జారిపడి	107	53	54
బలవన్మరణాలు	110	61	49
సహజ మరణాలు	12	8	4
మొత్తం	229	122	107

గమనిక: ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు

కొనఊపిరితో ఉన్నా కాపాడలేని పరిస్థితి

సాధారణంగా రహదారిపై జరుగుతున్న ప్రమాదాలు అందరికి కనిపిస్తుంటాయి. రోడ్డు ప్రమాదం జరిగితే అయ్యో అంటూ ప్రజలు పరుగులు తీసి అవసరమైన సాయం అందిస్తారు. కానీ రైలు పట్టాలపై జరిగే ఘటనలు చాలా వరకు ఎవ్వరికి కనిపించవు. ప్రమాదవశాత్తు కొందరు.జీవితంపై విరక్తి చెంది మరి కొందరు ఇలా ఎందరో రైలు చక్రాల కింద నలిగి తనువు చాలిస్తున్నారు. రైలు పట్టాలపై జరిగే ప్రమాదాలు ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. లోకో పైలెట్, కీమెన్‌లు, ట్రాక్ మెన్‌లు స్టేషన్‌మాస్టర్ దృష్టికి తీసుకొస్తే ఆయన రైల్వే పోలీసులకు సమాచారం అందిస్తారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేస్తారు. లోకోపైలెట్, కీమెన్‌లు, ట్రాక్‌మెన్‌లు గుర్తించకపోతే అంతే సంగతులు. జనసంచారం కలిగిన ప్రాంతాల్లో రైలు ప్రమాదంలో తీవ్రగాయాలైన వారికి సకాలంలో వైద్యసేవలు అందించే అవకాశం ఉంది. జన సంచారం లేని ప్రాంతాల్లో తీవ్రగాయాల పాలైన వారిని కాపాడుకోలేని పరిస్థితి. కొన ఊపిరితో ఉన్నా ఎవరూ చూడక, వైద్య అందక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతున్నారు.



రైలు ఢీకొనడంతో మృత్యువాత పడిన మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్సై (ఫైల్)


ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం



కదిలే రైలు ఎక్కడం, దిగడం చేయరాదు. ఫుట్ బోర్డులపై నిలబడి, డోర్‌వద్ద కూర్చుని ప్రయాణించరాదు. ఒకవేళ రైలు స్టేషన్ దాటిపోతే మరోస్టేషన్‌లో దిగి గమ్యస్థానాలకు చేరుకోవాలి. రైలు పట్టాలు దాటాల్సి వస్తే ముందు వెనుక చూసుకోవాలి. మలుపుల వద్ద జాగ్రత్తగా ఉండాలి. రైల్వేస్టేషన్‌లలో వంతెనల మీదుగా నడవడం మంచిది. పట్టాలపై నడిచేవారిపై చర్యలు తప్పవు. రైలు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. రైలు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పీ మల్లికార్జున, రైల్వే డీఎస్పీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



లారీని ఢీకొనడంతో దెబ్బతిన్న మోటారుసైకిల్



ఘటనా స్థలంలో మృతుడు, క్షతగాత్రుడు

సింగరాయకొండ: ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును క్రాస్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొన్న ఘటనలో మోటారుసైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో సింగరాయకొండ మండల పరిధిలోని మలినేని సుశీలమ్మ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో కందుకూరు రోడ్డుపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని యర్రగుంటపాళేనికి చెందిన ఎలిక సాయికుమార్ (27), బండపాళేనికి చెందిన నాయుడు మహేష్ (28) మోటారుసైకిల్‌పై కందుకూరు నుంచి సింగరాయకొండ వైపు వెళ్తున్నారు. మోటారుసైకిల్ పలుకూరు అడ్డరోడ్డు దాటి నెల్లూరు జిల్లా సరిహద్దు నుంచి ప్రకాశం జిల్లాలోకి రాగానే ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును క్రాస్‌చేసి ముందుకెళ్లే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో మోటారుసైకిల్‌పై ప్రయాణిస్తున్న సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొనఊపిరితో ఉన్న మహేష్‌ను కందుకూరు ఏరియా ఆస్పత్రికి ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో తరలించారు. కానీ అప్పటికే మహేష్ కూడా మరణించాడు. ఈ ఘటనలో మోటారుసైకిల్ పూర్తిగా ధ్వంసమైంది. సాయి, మహేష్ ఇద్దరూ యర్రగుంటపాళెంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానితులను పిలవడానికి సింగరాయకొండ వెళ్తూ ప్రమాదానికి గురైనట్లు సాయి బంధువులు తెలిపారు. సాయి కందుకూరులోని హరిణి ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఒక చెల్లెలు ఉంది. చేతికందివచ్చిన ఒక్కగానొక్క కొడుకు మృత్యువాతపడడంతో సాయి తండ్రి మాధవరావు ఆవేదన చూపరులను కలచివేసింది. ఇటీవల వీరు నూతనంగా ఇల్లు నిర్మించుకుని గృహ ప్రవేశం కూడా చేశారు. నాయుడు మహేష్ ఇటీవల వరకు హైదరాబాద్‌లో ఉన్నాడు. ప్రస్తుతం కందుకూరు వచ్చి ఆటో నడుపుకుంటూ వాయిదా పద్ధతిపై ఫర్నిచర్ అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి వివాహమైంది. ప్రమాదం జరిగిన స్థలాన్ని సీఐ దాచేపల్లి రంగనాథ్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీరామ్ వెల్లడించారు.



ఏలిక సాయికుమార్ (ఫైల్)



నాయుడు మహేష్ (ఫైల్)

పొగాకు పంట పరిమితి యథాతథం

- 2023-24 పంట సీజన్‌కు ప్రకాశం రీజియన్‌లో 89.9 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతి
- ఎస్ఎల్ఎస్ పరిధిలో బ్యారన్‌కు 36.50 క్వింటాళ్లు, ఎస్‌బీఎస్ పరిధిలో 35.50క్వింటాళ్లకు పరిమితి



పొగాకు పంట

కందుకూరు: గత ఏడాది పొగాకు సాగు చేసిన రైతులకు లాభాల పంట పండింది. దిగుబడుల దగ్గర నుంచి ధరల వరకు రైతులకు అన్ని అనుకూల అంశాలే. గతంలో ఎన్నడూ లేని విధంగా గరిష్ట ధరలు నమోదు కావడంతో రైతులు భారీగా లాభాలు ఆర్జించారు. దీంతో ఈ ఏడాది భారీ విస్తీర్ణంలో పొగాకు సాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. అయితే 2023-24 పంట సీజన్‌కు సంబంధించి పొగాకు పంట పరిమితిని గతేడాది పరిమితినే బోర్డు కొనసాగించింది. రాష్ట్రంలో 142 మిలియన్ కేజీల పొగాకు పండించేందుకు అనుమతి ఇవ్వగా ప్రకాశం రీజియన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 89.9 మిలియన్ కేజీలు నిర్ణయించింది. 2022-23 పంట సీజన్‌కు ఈ కోటాను నిర్ణయించగా ఈ ఏడాది కూడా అదే నిర్ణయం తీసుకుంది. అయితే ఈ ఏడాది వచ్చిన లాభాలతో రైతులు పంట పరిమితిని పెంచాలని బోర్డును డిమాండ్ చేస్తూ వచ్చారు. కానీ బోర్డు మాత్రం ఎలాంటి మార్పులు చేయకుండా గతేడాది పరిమితినే యథాతథంగా ఉంచింది.

ప్రకాశం రీజియన్‌లో 89.9మిలియన్ కేజీలకు అనుమతి

పొగాకు బోర్డు మొత్తం 142 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తికి అనుమతించగా దీనిలో ఎస్‌బీఎస్ (సదరన్ బ్లాక్ సాయిల్) పరిధిలో 41.6 మిలియన్ కేజీలు, ఎస్ఎల్ఎస్ (సదరన్ లైట్ సాయిల్) పరిధిలో 48.3 మి.కేజీలు, ఎస్ఎల్ఎస్ పరిధిలో 49.31 మి.కేజీలు, ఎస్‌బీఎస్ పరిధిలో 3మి.కేజీల ఉత్పత్తులను పండించవచ్చు. దీనిలో భాగంగా ప్రకాశం రీజియన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 89.9మిలియన్ కేజీల పొగాకు పండించుకునేందుకు 2023-24 పంట సీజన్‌కు బోర్డు అనుమతిచ్చింది. ప్రకాశం రీజియన్ పరిధిలో మొత్తం 11 వేలం కేంద్రాలున్నాయి. వీటిలో నెల్లూరు జిల్లాలో కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాలు, ప్రకాశం జిల్లాలో ఒంగోలు-1, ఒంగోలు-2, కొండపి, కనిగిరి, టంగుటూరు, వెల్లంపల్లి, పొదిలి వేలం కేంద్రాలున్నాయి. వీటిలో దక్షిణ ప్రాంత తేలిక నేలల పరిధిలో (ఎస్ఎల్ఎస్) 6 వేలం కేంద్రాలు, సదరన్ బ్లాక్ సాయిల్(ఎస్‌బీఎస్) పరిధిలో 5 వేలం కేంద్రాలున్నాయి. అదే సందర్భంలో బ్యారన్ పరితిమిని కూడా నిర్ణయిస్తూ బోర్డు నిర్ణయించింది. ఇది ఎస్ఎల్ఎస్ పరిధిలో 2.90 హెక్టార్‌ల్లో పంట సాగు చేసుకునేందుకు, బ్యారన్‌కు 36.50 క్వింటాళ్లను, ఎస్‌బీఎస్ పరిధిలో 1.90హెక్టార్ హెక్టార్‌ల్లో 35.50 క్వింటాళ్లను అమ్ముకునేలా నిర్ణయం తీసుకుంది.

బోర్డు అనుమతి మేరకే సాగు చేసుకోవాలి

పొగాకు మార్కెట్ ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉంటాయి. రైతులు ఈ ఏడాది లాభాలను చూసి వచ్చే పంట సీజన్‌కు భారీగా పొగాకు సాగు చేయకుండా పంట నియంత్రణ పాటించాలి. బోర్డు అనుమతించిన మేరకే పొగాకు పండిస్తే మార్కెట్ ఆశాజనకంగా ఉంటుంది.

ఎం లక్ష్మణరావు, ఆర్‌ఎం ఎస్ఎల్ఎస్

సర్వేపల్లి కాలువలో పడి యువకుడి మృతి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలోని సర్వేపల్లి కాలువలో ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. రూరల్ పోలీసులకు సమాచారం అందించగా వారు దర్యాప్తు చేపట్టారు. వివరాలు..నగరంలోని మైపాడు గేట్ సెంటర్‌కు చెందిన బెల్లంకొండ వెంకటేష్ (27) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అవివాహితుడైన అతడు మద్యానికి బానిసై నిత్యం మద్యం మత్తులో ఉండేవాడు. ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంకటేష్ మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. వెంకటేష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని రూరల్ పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా వలంటీర్లు మూడో రోజైన ఆదివారం వైఎస్సార్ పెన్షన్ కానుకను ముమ్మరంగా పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారికి అక్కడికి వెళ్లి అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కలిగిరిలో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షేక్ గౌస్‌పీర్



కంటి ఆపరేషన్ చేయించుకుని హైదరాబాద్‌లో ఉంటున్న ఆత్మకూరుకు చెందిన వెంకట సుబ్బమ్మకు అక్కడకు వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సౌజన్య

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■ **Last Chance:** 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629 [T-4560]

PARAMEDICAL

■ ప్రభుత్వ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radiographic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry, ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఎనీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజి ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225 [OA-99]

REAL ESTATE

HOUSE FOR SALE

■ నెల్లూరు నుండి 8km దూరంలో మైపాడు రోడ్డుకు ఇండిపెండెంట్ 1BHK 29,90,000 రేటుకు, ఇండిపెండెంట్ 2BHK 34,90,000కు అమ్మబడును. సెల్: 63004 37419. [NA-22482]

LAND FOR SALE

■ ధనలక్ష్మీపురం కాకుపల్లి సెంటర్ నుండి 2 km దూరంలో 25 సెంట్లు భూమి అమ్మబడును. (With Farm House) వివరాలకు సంప్రదించండి. : 70362 31356. [NA-22481]

PLOT FOR SALE

■ కావలి హైవే ఫేసింగ్‌లో అంకణం 45000 మాత్రమే. అన్ని వసతులతో ఇప్పటికి ఇప్పుడు ఇల్లు కట్టుకొనుటకు అనువైన వెంచర్స్ కలవు. సంప్ర: 86399 75344, 80748 07328. [N-781571]

■ నెల్లూరు నుండి చెన్నైకి వెళ్లే హైవే రోడ్డు అనుకుని మరోవైపుకృష్ణపట్నం రోడ్డు వరగలి రోడ్డుకు నుడా అప్రూవల్. అతి తక్కువ ధరకే ఓపెన్ ప్లాట్స్ స్పాట్ రిజిస్ట్రేషన్,బ్యాంక్‌లోన్ సౌకర్యం. 76619 63007. [NA-22473]

SALE / RENT

■ నెల్లూరు మాగుంట లేఅవుట్ నెల్లూరు హబ్ దగ్గర అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ సేల్ & రెంటుకి ఇవ్వబడును. వివరాలకు సంప్రదించండి. సెల్: 99487 87171, 90106 84970. [N-785361]

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-788217]

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థ లలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్. సంప్ర।। ✆ 96590 57777 [B-476]

BUSINESS OFFER

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221536]

FOR SALE

■ నెల్లూరు సిటీలో రన్నింగ్‌లో ఉన్న సూపర్ మార్కెట్ అమ్మబడును లేదా పార్ట్‌నర్‌షిప్ ఇవ్వబడును. ఆసక్తి గల వారు సంప్రదించగలరు. సెల్ : 70326 10569. [NA-5851]

WANTED

■ **A BDS doctor is required for a clinic. Contact: 9701281917.** [HA-05070]

■ **Wanted Teachers to Teach EVS** subjects I to VII Classes. Salary: 10000. Contact : 84998 16075, 99664 51182. [NA-10917]

■ **Wanted Teachers to Teach Hindi** subjects 6th to 10th Classes. Salary: 15000. Further Details Contact: 84998 16075, 99664 51182. [NA-10918]

■ **Mi BroadBand Wanted Cable, Fiber** Technicians, Electricians, Comp Hardware, Helpers. Sal: 10000-17000. Contact : 86866 11666, 92999 99498. [NA-22475]

■ నెల్లూరు సిటీ అమెజాన్ నందు వర్క్ చేయుటకు డెలివరీ బాయ్స్ - నైట్ డ్యూటీ బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. 93912 40756, 79936 91149. [NA-22472]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మా ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్ /ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు నుండి ఆపైన సంపాదించే అవకాశం. Cont: 88854 86421 [G-751660]

■ రాయల్ సూపర్‌మార్కెట్ & రిచ్ గోల్డ్ ఉమెన్స్ షాపి నందు అనుభవం గల మేనేజర్లు, సేల్స్ గర్ల్స్ కావలెను. అర్హత:10th ఆపైన. ఇంటర్వ్యూ: 4వ తేది సోమవారం. సెల్ : 70138 39901. [N-1205753]

■ నెల్లూరు నగరంలోని మా సంస్థలో పని చేయుటకు Tops and Kurthi Stiching టైలర్స్ కావలెను. సంప్ర: DP ఎంటర్‌ప్రైజెస్, మాగుంట లేఅవుట్. సెల్ : 74169 96333. [NA-10922]

■ నెల్లూరు హరనాథపురం మెయిన్‌రోడ్‌లో AMR పెట్రోల్ బంక నందు డే & నైట్ షిఫ్ట్‌లో పని చేయుటకు యువతి/యువకులు& ఎయిర్‌బాయ్స్ కావలెను. సెల్: 89852 64143, 94947 97343. [NA-5857]

■ MG బ్రదర్స్ HPCL పెట్రోల్ బంక్ బుజబుజ నెల్లూరు నందు పని చేయుటకు పంప్ బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. సెల్: 92467 77125, 92467 77128. [NA-5844]

■ ఫెయిత్ డా।। రమణి, BPT, MIAP, 10th చదివిన అమ్మాయిలు, ఫిజియో అసిస్టెంట్లుగా, ఆయా కావలెను. మధురా స్వీట్స్ ఎదురు వీధి, బృందావనం2వ వీధి,నెల్లూరు.92464 65433. [NA-22471]

■ ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 84658 43194 [G-1103]

■ వెంకటాచలం, గొలగమూడి, కుక్కుటూరు, చెముడుగుంట పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, SO కావలెను. జీతం: 12వేలు+ఫ్రీ రూం. 6302252056, 7286909727 [G-7586]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888 [HA-569]

■ కస్తూర్బా సేవ్. VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/- ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్: 9391753308. [HA-576]

■ ఫైనాన్స్ కంపెనీ నందు నెల్లూరు, ఇందుకూరు పేట, ధనలక్ష్మిపురం, కోవూరు, బుచ్చిరెడ్డి పాలెం, కావలి, పొదలకూరు, చేజర్ల నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ & టీమ్ లీడర్స్ కావలెను. ఫోన్ : 9392915938, 9392915944. [HA-575]

■ సాయి ప్రాపర్టీస్ & ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు అనుభవజ్ఞులైన రియల్ ఎస్టేట్ ఏజెంట్లు కావలెను. ఆకర్షణీయమైన కమీషన్ ఇవ్వబడును. ఆసక్తి గల వారు సం.ప్ర: 93901 67716 [L-787347]

■ రాజ్ సర్ఫ్ వారి డిటర్జెంట్ లిక్విడ్ సేల్ చేయుటకు సేల్స్ బాయ్స్ మరియు రిప్రజెంటేటివ్స్ అర్బన్ మరియు రూరల్ ప్రాంతాలలో పనిచేయుటకు జిల్లా వ్యాప్తంగా కావలెను. ఆకర్షణీయమైన జీతం+TA లభించును. ఆసక్తి గల వారు ఈ నెంబర్లకు సంప్ర.6301461812, 7032430469. [C-777026]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.